క్లుప్తంగా

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



గౌరీపరమేశ్వరుల ఊరేగింపు

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో శ్రీ గౌరీ పర్వమేశ్వరుల ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మూడు నెలలుగా స్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి చివరి శనివారం భారీ ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు మహిళలు స్వామివారి సారె ఊరేగింపు నిర్వహించారు.

రైతు కూలీల సంక్షేమ జేఏసీ ఏర్పాటు

పాయకరావుపేట : రైతు కూలీల సమైక్య వెల్ఫేర్ అసోసియేషన్ జేఏసీ ఏర్పాటు చేసినట్టు జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు తెలిపారు. కుమారపురం, రత్నయ్యమ్మపేట, రాజగోపాలపురం, కొర్లయ్యపేట, గ్రామాల్లో 150 మంది వరకు రైతు కూలీలు ఉన్నారన్నారు. వీరి సమస్యల పరిష్కారానికి సంఘం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సంఘం అధ్యక్షునిగా చేపల శ్రీరామమూర్తి, అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా మోసా అప్పలరాజు, కార్యదర్శిగా డి.నాగేశ్వర రావుతో పాటు పలువురు సంఘం సభ్యులను నియమించినట్టు తెలిపారు. సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు.

అయోధ్య రాముని అక్షింతల ఊరేగింపు

అచ్యుతాపురం : మండలంలోని ఆవ సోమవరంలో శనివారం అయోధ్య రాముని అక్షింతలు ఊరేగించారు. గ్రామ వీధుల్లో ఊరేగించిన అక్షింతలను రామాలయంలో పూజించారు. అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట నేపథ్యంలో ఈ కార్యక్రమం ప్రాధాన్యం సంతరించుకొంది. ఎంపీటీసీ బాబూరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : అయోధ్య శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్రంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా కొరుప్రోలు గ్రామానికి వచ్చిన అక్షింతలను శనివారం కొరుప్రోలు వైఎస్సార్ కాలనీలో గ్రామ వలంటీర్ మడగల యమున పంపిణీ చేశారు. శ్రీరాముని పేరుతో వచ్చి పవిత్ర అక్షింతలు వచ్చాయని తెలియడంతో స్థానికులు తీసుకునేందుకు ఆసక్తి కనబరచారు. సోమవారం సాయంత్రం ఇంటి ముందు దీపాలు వెలిగించాలని చెప్పారు.

ఓటుహక్కుపై అవగాహన

అనకాపల్లి : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శనివారం దివ్యాంగులకు ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఐదేళ్లకోసారి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకుని తమకు మేలు చేసే నాయకుడిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సచివా లయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళం



సర్పంచ్ గంగప్పలనాయుడుకు విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మూలపేటలోని గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి దాతలు సహకరించాలని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. శనివారం ఆలయ నిర్మాణానికి మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు రూ.5116 నగదును విరాళంగా అందజేశారు.

22 నుంచి సామాజిక తనిఖీ

కోటవురట్ల : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై ఈ నెల 22 నుంచి సామాజిక తనిఖీ జరుగుతుందని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. ప్రస్తుతం నిర్వహించిన పనులు, నిధుల వినియోగంపై, ఉపకార వేతనాలపై ఆడిట్ జరుగుతోందని తెలిపారు. ఆడిట్ పూర్తి కాగానే గ్రామాల్లో పనులను పరిశీలించి సామాజిక తనిఖీ చేస్తారని తెలిపారు. తనిఖీ అనంతరం గ్రామసభల ద్వారా రైతులకు వివరించి సామాజిక తనిఖీ బృందాలు ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు.

చురుగ్గా కులగణన

- రెండ్రోజుల్లో 3491 కుటుంబాల వివరాలు యాప్‌లో నమోదు
- సాంకేతిక సమస్యలు అధిగమించేందుకు రాత్రి వేళల్లో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు



కొరుప్రోలులో కులగణన సర్వే చేస్తున్నారు.



పట్టణంలోని ఎస్సీకాలనీలో కులగణన సర్వేలో భాగంగా యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఎన్యూమరేటర్లు

యలమంచిలి రూరల్ : యలమంచిలి పట్టణం, మండలంలోని గ్రామాలు, వార్డుల్లో కులగణన చురుగ్గా జరుగుతోంది. శుక్రవారం ప్రారంభమైన కులగణన పట్టణంలో 13 సచివాలయాలు, మండలంలో 10 సచివాలయాల పరిధిలో ఎన్యూమరేటర్లు సర్వేను ప్రారంభించారు. మొదటి రెండ్రోజుల్లో 3491 కుటుంబాల్లోని 6985 కుటుంబసభ్యుల వివరాలను కులగణన యాప్‌లో ఎన్యూమరేటర్లుగా ఉన్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు నమోదు చేశారు.

2011 జనాభా లెక్కల ప్రకారం యలమంచిలి పట్టణం, మండలంలో మొత్తం 24,931 కుటుంబాలున్నాయి. ఆయా కుటుంబాల్లో 68,497 మంది జనాభా ఉన్నారు. సమగ్ర కులగణనలో భాగంగా గత రెండ్రోజుల్లో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమగ్ర వివరాలు సేకరించారు. కుంటుంబంలోని ప్రతి వ్యక్తి పేరు, ఆధార్ నంబర్, అడ్రస్, కుటుంబంలోని సభ్యుల సంఖ్య, ఆయా సభ్యులు చదివిన విద్య, చేస్తున్న ఉద్యోగం, వారికి ఉన్న పశుసంపద, భూమి, ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ వాడుతున్నారా? లేదా కట్టెల పొయ్యి వినియోగిస్తున్నారా? మతం, కులం తదితర వివరాలను ఎన్యూమరేటర్లు సమగ్రంగా సేకరిస్తున్నారు. అనంతరం సచివాలయ కార్యదర్శులు, కుటుంబ యజమానులు ఈకేవైసీ వేసి సర్వేను ధృవీకరించేలా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. ఈ సర్వే జనవరి 19 నుంచి 28వ తేదీ వరకు కొనసాగుతుంది.సర్వే సమయంలో వివరాలు తీసుకోలేకపోయిన కుటుంబాల వివరాలను జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు సేకరిస్తారని, ఫిబ్రవరి 3 నుంచి 15వ తేదీ వరకు సేకరించిన వివరాలను పరిశీలించి కులగణన తుది జాబితాను విడుదల చేస్తామని యలమంచిలి మున్సిపల్ కమిషనర్ కె.ఎ.కొండలరావు చెప్పారు. కులగణన యాప్‌లో సాంకేతిక సమస్యలు రావడంతో గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగ్గా పనిచేయకపోవడంతో వివరాల నమోదులో ఎన్యూమరేటర్లు ఇబ్బంది పడ్డారు. సర్వర్ సమస్యతో పగటి సమయంలో వివరాల నమోదులో ఇబ్బందులు ఎదురవుతుండడంతో యలమంచిలి పట్టణంలో శనివారం రాత్రి దిమిలి రోడ్డు, తులసీనగర్ భూలోకమాంబ ఆలయ ప్రాంతాల్లో సర్వే చేపట్టామని కమిషనర్ కొండలరావు తెలిపారు. సమగ్ర కులగణనపై ప్రజలు ఎలాంటి అపోహలకు తావులేదని, అన్ని కులాలకు సామాజిక, ఆర్థిక రాజకీయ ప్రయోజనాలు కల్పించడానికే కులగణనను ప్రభుత్వం చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కులగణన ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏ సామాజిక వర్గాలకు చెందిన వారు ఎంతమంది ఉన్నారో తెలుసుకుని అన్నివర్గాల అభ్యున్నతికి బాటలు వేయాలన్న సమున్నత లక్ష్యంతోనే క్షేత్రస్థాయిలో కులగణన చేపడుతున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

చురుగ్గా కులగణన

ఎస్.రాయవరం : గ్రామాల్లో కులగణన కార్యక్రమం శరవేగంగా జరుగుతోంది. మొదట్లో సర్వర్ ఇబ్బందులు గురైనప్పటికీ గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నేరుగా ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే చేస్తూ వివరాలు సేకరణ చేస్తున్నారు. కొరుప్రోలు గ్రామంలో వీఆర్వో శ్రీధర్, వలంటర్ల వివరాలు సేకరించారు. కులగణన నమోదు చేస్తున్నారు. మండలంలో రెండు రోజులుగా కులగణపై అవగాహన కలిస్తూ నమోదు చేస్తున్నారు.

ఆడారి ఆనంద్‌కుమార్‌కు శుభాకాంక్షల వెల్లువ



ఆడారి ఆనంద్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

యలమంచిలి : విశాఖ డెయిరీ చైర్మన్, విశాఖ వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ జన్మదినం సందర్భంగా యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం విశాఖపట్నం తరలివెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆనంద్‌కుమార్ జన్మదినం పురస్కరించుకుని పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, విశాఖ డెయిరీ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి,శాలువాలతో కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వైఎస్సార్‌సీపీలో ఉన్నతమైన పదవులతో భవిష్యత్‌లో రాణించాలని కార్యకర్తలు ఆకాంక్షించారు. యలమంచిలి వైఎస్సార్‌సీపీ నేతలు ఆడారి వెంకట్, యల్లపు సూరి అప్పారావు, మునగపాక నానాజీ, బెజవాడ నాగేశ్వరరావు, సుంకర గిరి,దాడి కిరణ్,దాడి నాయుడు,మళ్ల శివ,బి.సురేష్,ఎస్.బాబుజీ తదితరులు ఆనందకుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాద స్థితిలో వంతెన



ప్రమాదకరంగా ఉన్న రామచంద్రపురం వంతెన

కోటవురట్ల : రామచంద్రపురం జంక్షన్‌లోని వంతెన ప్రమాద స్థితిలో ఉంది. ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు కనీస నిర్వహణ చర్యలు కూడా చేపట్టకపోవడంతో వంతెనకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. వంతెన బీటలు వారి కూలేందుకు సిద్ధంగా ఉంది. వంతెన అడుగు భాగం ఇనుప రేకు కారణంగా తుప్పు పట్టి రాలిపోతోంది. ఈ వంతెన కూలిపోతే అడ్డురోడ్డు వెళ్లేందుకు వాహనదారులకు అవస్థలు తప్పవు. ముందుగానే అధికారులు మేల్కొనాలని పలువురు కోరుతున్నారు. శిథిల వంతెన పక్కనే కొత్త వంతెన నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

అంగన్‌వాడీల మానవహారం



మునగపాకలో మానవహారం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మునగపాక : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం మునగపాకలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాస్తారోకోతో పాటు మానవహారం నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ బ్రహ్మాజీ మాట్లాడుతూ 40 రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేస్తున్నారని, ప్రభుత్వం వారి కనీస కోర్కెలు పరిష్కరించాలని అన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రామలక్ష్మి, అంజలి, తులసి లక్ష్మి, ఉమ, సరస్వతి ఆందోళనలో పాల్గొన్నారు.

26న గౌతమపఠన మందిరం వార్షికోత్సవం



గౌతమపఠన మందిరం వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక : మునగపాకలోని గౌతమపఠన మందిరం 49వ వార్షికోత్సవాలను ఈ నెల 26న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మందిర కార్యదర్శి వెలగా శ్రీనివాసరావు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకల్లో పలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. 24న ఉదయం 9 గంటలకు విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు, మధ్యాహ్నం 2 గంటలకు మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్ పోటీలు, 25న మహిళలకు ముగ్గుల పోటీలు జరుగుతాయన్నారు. 26న ఉదయం జెండా ఆవిష్కరణ, రాత్రి 7గంటలకు ఆదర్శ రైతు కుటుంబాలకు సత్కారం, 8గంటలకు భరత నాట్యం ప్రదర్శన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాడి అప్పలనాయుడు, శ్రీరామమూర్తి, ఆడారి లక్ష్మణరావు, కుంది సూర్యనారాయణ, ఆడారి పరశురామ్, మారిశెట్టి అప్పారావు, గోగుల నెహ్రూ, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కంబాల జోగులు



వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్తగా ఇటీవల నియమితులైన ఎమ్మెల్యే కంబాల జోగులు తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మండల స్థాయి క్రికెట్ పోటీల విజేత పాల్మన్‌పేట



క్రికెట్‌లో మండల స్థాయిలో విజయం సాధించిన పాల్మన్‌పేట జట్టు

పాయకరావుపేట : ఆడుదాం – ఆంధ్రా పోటీల్లో మండల స్థాయి క్రికెట్ పోటీలు విజేతల్లో పాల్మన్‌పేట గ్రామానికి చెందిన యువకులు విజయం సాధించారు. మండలంలో గల 25 గ్రామ సచివాలయాలకు గాను బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ, క్రికెట్ పోటీలు సచివాలయ అధికారులు నిర్వహించారు. పురుషులు 25 జట్లు, మహిళలు 25 జట్లు ఈ పోటీల్లో తలపడ్డాయి. మండల స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్మన్‌పేట జట్టు విజయం సాధించినట్టు క్రీడల నిర్వాహకులు తెలిపారు. బ్యాడ్మింటన్‌లో మండల స్థాయిలో పాయకరావుపేట రెండో సచివాలయంలో పురుషులు, స్త్రీలు జట్లు విజయం సాధించాయి. వాలీబాల్ పోటీల్లో పాయకరావుపేట 5 వ సచివాలయం, గుంటపల్లి టీమ్‌లు విజయం సాధించాయి. ఖో ఖో పోటీల్లో శ్రీరాంపురం సచివాలయం జట్టు, కబడ్డీ పోటీల్లో శ్రీరాంపురం పురుషులు, పాల్మన్‌పేట మహిళలు జట్టు విజయం సాధించినట్టు క్రీడల నిర్వాహకులు మంగవరం గ్రామ కార్యదర్శి నరేష్ తెలిపారు.

నేడు సీతారాముల తీర్థ మహోత్సవం

ఆకట్టుకుంటున్న దీపాలంకరణ



తాళ్లపాలెంలో విద్యుద్దీపాలంకరణతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల కటౌట్లు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో సీతారాముల తీర్థ మహోత్సవాన్ని ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. మండలంలో జరిగే సంక్రాంతి తీర్థాల్లో పెద్ద తీర్థంగా పేరొందిన ఈ ఉత్సవానికి మండలంలోని గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా హాజరవుతారు. ఏటా సంక్రాంతి నుంచి ఆరు రోజుల తర్వాత తీర్థాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ క్రమంలోనే ఈ ఏడాది అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విద్యుద్దీపాలంకరణతో దేవతామూర్తుల కటౌట్లను ఏర్పాటు చేశారు. ప్రవేశ ద్వారాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పిల్లల కోసం జెయింట్ వీల్, రంగుల రాట్నాలు, వినోదం కోసం రెండు డ్యాన్స్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



మునగపాక హైస్కూల్‌లో బ్లాక్‌బోర్డుపై రూమ్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

మునగపాక : మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 5వ తరగతిలోకి ప్రవేశించేందుకు ప్రభుత్వం పరీక్ష ఏర్పాటు చేసింది. మునగపాక హైస్కూల్లో 192 మంది విద్యార్థులకు గాను 158 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు.

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి గురుకుల పాఠశాలలో నవోదయ ప్రవేశపరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ కేంద్రంలో మొత్తం 240 మందికిగాను 203 మంది హాజరయ్యారు. ఎటువంటి మాస్‌కాపీయింగ్ అవకాశం లేకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పరీక్షలు ఇంగ్లిష్ మీడియంలో జరిగాయని ఎంఈవో నరేష్ తెలిపారు.

నేత్రపర్వంగా వెంకన్న కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : దొంకాడ గ్రామంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం నేత్రపర్వంగా జరిగింది. ప్రతి ఏటా సంక్రాంతి అనంతరం ఇక్కడ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. ఈ కల్యాణం తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిమంది భక్తులు తరలివస్తారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తిలను ఉదయం గ్రామంలో ఊరేగించారు. అనంతరం వందలాది మంది భక్తుల సమక్షంలో స్వామివారికల్యాణ ఘట్టాన్ని అర్చక స్వాములు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి భక్తులు కానుకలు, మొక్కుబడులు సమర్పించుకున్నారు. వివిధ భజన బృందాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

చురుగ్గా నూకాంబిక ఆలయ నిర్మాణం



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ, ప్రసాద్

అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్ చెప్పారు. ఈవో కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే రూ.10 కోట్లతో ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రహదారిని ఆనుకొని ఉన్న దక్షిణం వైపు రాజగోపురాన్ని రూ.కోటి 71లక్షలతో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. క్యూ కాంప్లెక్స్‌తో పాటు విశాలంగా మండపం నిర్మాణ పనులు రూ.కోటి 60 లక్షలతో జరుగుతున్నాయన్నారు. సీజీఎఫ్ నిధుల నుంచి రూ.3 కోట్ల 31 లక్షలు మంజూరు చేయాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కోరగా, ఆయన రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి, దేవదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ల దృష్టికి నిధులు మంజూరు విషయాన్ని తీసుకెళ్లారన్నారు. మంత్రి అమర్‌నాథ్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మునగపాక : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు కోరారు. కొత్త నాగవరంలో శ్రీ ఆంజనేయ స్వామి తీర్థ మహోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల విజేతలకు శుక్రవారం రాత్రి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాలిపిని సత్యనారాయణ, గెంజి రమణ,అప్పికొండ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



రాంబిల్లిలో ఖోఖో పోటీలు



వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు

రాంబిల్లి : మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో పురుషుల విభాగంలో ఐదు జట్లు, మహిళల విభాగంలో ఐదు జట్లు విజేతలుగా నిలిచినట్లు ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు తెలిపారు.

ఈ జట్లు నియోజకవర్గ స్థాయిలో తలపడతాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఘటనాస్థలి వద్ద క్షతగాత్రులు

తుమ్మపాల: మండలంలోని శంకరం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామీణ ఎస్‌ఐ నర్సింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మ గృహ సముదాయానికి చెందిన కొత్తపల్లి కుమార్ తన బైక్‌పై సబ్బవరం వెళ్తుండగా.. అనకాపల్లి నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కుమార్‌తో పాటు మరో వ్యక్తి గాయపడినట్లు ఎస్‌ఐ తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోండి



వికసిత్ భారత్ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి, ఆరోగ్య భద్రత పెంచుకోవాలని ఈవోపీఆర్డీ సత్యనారాయణ చెప్పారు. జేవీ పాలెం, పి.ధర్మవరం గ్రామాల్లో వికసిత భారత్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందజేసిన పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వసిద్ధి వైద్యాధికారి శక్తిప్రియ, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

అనకాపల్లి: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి ఎస్.శ్రీవిద్య సూచించారు. మహిళలపై లైంగిక వేధింపుల చట్టం–2023పై మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గవరపాలెం చినహైస్కూల్లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోక్సో చట్టం గురించి వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్‌కు మంచి ఆదరణ లభించిందన్నారు. దిశ యాప్‌కు పెద్ద ఎత్తున మహిళల నుంచి అధికంగా కాల్స్ వస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ జడ్జి జి.గంగరాజు, సివిల్ జడ్జి పి.ప్రదీప, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.వి.విజయలక్ష్మి, డీఎస్పీ వి.సుబ్బరాజు, డీఅండ్‌హెచ్‌వో ఎ.హేమంత్, జెడ్పీ ఎస్.వెంకటరమణ, తహసీల్దార్ గంగాధరరావు, సామాజిక ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరాముడు పతాకావిష్కరణ



మూలకొత్తూరులో శ్రీరాముడు పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

రాంబిల్లి : గోకివాడ శివారు మూలకొత్తూరు గ్రామంలో శనివారం శ్రీరాముడు పతాకాలను ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు ఎస్.వి. సూర్యనారాయణ ఆవిష్కరించారు. ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభం, శ్రీరాముడు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఈ పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ బీపీఎం ద్వారపురెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.